వంతెనకు మోక్షం కలిగేనా?

- పెద్దమావందిలో ఎనిమిదేళ్ల క్రితం మొదలు పెట్టిన వంతెన నిర్మాణ పనులు
- సుమారు రూ.3.50 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- వంతెన పూర్తవడానికి ఇంకా కావాల్సిన నిధులు రూ. కోటిన్నర
- పట్టించుకోని అధికార యంత్రాంగం


పసుపు వాగు నీటిలోంచి వస్తున్న రైతు (ఫైల్)


పెద్దమావంది శివారులోని పసుపు వాగుపై అర్ధంతరంగా నిలిచిపోయిన వంతెన నిర్మాణం

బోధన్: పెద్దమావంది గ్రామ అంచున ఉన్న పసుపు వాగుపై చేపట్టిన హైలెవల్ వంతెన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచి ఏళ్లు గడిచిపోయాయి. ఎనిమిదేళ్ల క్రితం మొదలు పెట్టిన ఈ వంతెన ఇప్పటికీ పూర్తికాలేదు. రూ.కోట్లు ఖర్చు పెట్టినా పూర్తి కాకపోయేసరికి ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజాధనం వృథా అయినట్లయింది. వాగు అవతలి భూముల్లో పంట సాగుకు వెళ్లేందుకు రైతులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే లక్ష్యంతో వంతెన నిర్మాణానికి పునాది పడింది. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం వల్ల పనులు వేగంగా సకాలంలో పూర్తి చేయించక పోవడం వల్ల అంచనా వ్యయం పెరిగి పెండింగ్‌లో పడింది. వంతెన నిర్మాణానికి 2015–16 ఆర్థిక సంవత్సరంలో నాబార్డు ద్వారా రూ.3 కోట్ల 50 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పనులను కాంట్రాక్టరుకు అప్పగించగా.. పీఆర్ ఇంజనీరింగ్ శాఖ పర్యవేక్షణలో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. పనులు పూర్తి చేయడంలో ఏళ్లుగా జాప్యం జరిగింది. 11 పిల్లర్లతో వంతెన నిర్మాణం ప్రారంభించారు. 9 పిల్లర్ల వరకు పై స్లాబ్ పనులు పూర్తి చేశారు. మరో రెండు పిల్లర్ల వరకు పై స్లాబ్, వంతెనకు ఇరు వైపులా రోడ్డు, వంతెనపైన రెండు వైపులా సైడ్ వాల్స్ పనులు మిగిలి ఉన్నాయి. నాలుగేళ్ల క్రితమే వంతెన పనులు నిలిచిపోయాయి.

ప్రతిపాదనలు పంపినా..

నిధుల మేరకు పనులు పూర్తి చేయించామని, మిగిలిన పనులకు అదనంగా నిధుల మంజూరు కోసం రూ.కోటి 40 లక్షల అంచనాతో రివైజ్డ్ ప్రతిపాదనలు పంపించామని ఇన్నాళ్లుగా అధికారులు చెప్పుకొస్తున్నారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాలేదు. నాలుగేళ్ల క్రితం నుంచి స్థానిక అధికారులు పలుమార్లు ప్రతిపాదనలు పంపించారు. కాని నిధులు మంజూరు కాలేదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి వంతెన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

గట్టెక్కని సాగు కష్టాలు..

పెద్దమావంది గ్రామ ప్రజలకు వ్యవసాయమే ముఖ్య జీవనాధారం. వాగు అవతలి ఒడ్డున గ్రామ రైతులకు 150 నుంచి 200 ఎకరాల వరకు సాగు భూములున్నాయి. వర్షాకాలం వాగులో వరద నీటి ఉధృతి కారణంగా రైతులు పంట పొలాలకు వెళ్లే పరిస్థితి ఉండదు. రైతులు సమీపంలోని మున్సిపల్ విలీన గ్రామమైన శ్రీనివాస్‌నగర్ మీదుగా సుమారు 4 కిలో మీటర్ల దూరం అదనంగా వెళ్లి పంట పొలాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. వానాకాలం సీజన్‌లో వరి నాట్లకు వెళ్లే సమయంలో కూలీలు, ఎరువులను తీసుకెళ్లేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వంతెన పూర్తయితే రైతులకు సాగు కష్టాలు దూరం కావడంతో పాటు పెద్దమావంది, బండారుపల్లి, రాంపూర్, కల్దుర్కి, చిన్నమావంది గ్రామాల ప్రజలకు జిల్లా కేంద్రంతో పాటు బోధన్ పట్టణ కేంద్రానికి వెళ్లేందుకు దూరాభారం తగ్గి రవాణా మరింత సౌకర్యంగా మారుతుంది.

"రైతులు ఇబ్బందులు పడుతున్నారు



వానాకాలంలో వాగు అవతలి ఒడ్డున ఉన్న పంట పొలాలకు వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిషత్తు సర్వ సభ్య సమావేశంలో ఈ విషయం గురించి చాలా సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాను. గత ప్రభుత్వంలో నిధులు మంజూరు కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని వంతెన పూర్తయ్యేలా చూడాలి.

– లక్ష్మయ్య, మాజీ సర్పంచ్, పెద్దమావంది

సృజనాత్మకతను వెలికి తీయడమే లక్ష్యం


కరపత్రాలు విడుదల చేస్తున్న ప్రతినిధులు

బోధన్ టౌన్(బోధన్): చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడమే ధారణ లక్ష్యమని జ్యోతిష్య పండితులు ఉదయ్‌శర్మ నాగర్ అన్నారు. బుధవారం బోధన్ పట్టణంలోని ఆయన నివాసంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. నేటి చిన్నారులే భవిష్యత్ మూలస్తంభాలని, వారిని సభ్య సమాజాన్ని నిర్మాణం చేసే దిశగా తయారు చేయాలనే ఉద్దేశ్యంతో ధారణ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మన వేదిక్ సాంప్రదాయాలు తెలియని కారణంగా పిల్లలు సెల్‌ఫోన్లు, టీవీలు చూస్తూ పాశ్చాత్య సంస్కృతి వైపు దృష్టి సారిస్తున్నారని, పిల్లల్లో క్రమశిక్షణ, యోగా, ధ్యానం వంటి అంశాలను సమ్మిళితం చేసి అవగాహన కల్పిస్తామన్నారు. ఈ నెల 29 నుంచి జూన్ 2 వరకు సమ్మర్ క్యాంప్‌ను బోధన్ పట్టణంలోని ఆంథోనీస్, లయోలా పాఠశాలలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రశాంత్, శ్రీ విద్య, సాయి, హారిక తదితరులున్నారు.

విద్యార్థులు సమాజ అభివృద్ధికి పాటుపడాలి


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

కమ్మర్‌పల్లి: విద్యార్థులు ఆత్మ గౌరవం, స్వయం క్రమశిక్షణ, సేవ, శౌర్యం, సమర్పణ మొదలైన ఉత్తమ గుణాలు అలవరచుకున్నప్పుడు భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా స్థిర పడతారని కోనాపూర్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాంప్రసాద్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రతిపాదించిన ప్రేరణ కార్యక్రమంతో పాటు విద్యార్థులు సమాజ అభివృద్ధికి చేయవలసిన కార్యక్రమాలను ఉపాధ్యాయులు జ్ఞానేశ్వర్, కవిత, గీత వివరించారు. 'ఉత్తమ సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్ర' అంశంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించగా గంగుల ఆకాంక్ష, ఎల్డి గౌతమ్‌లు ప్రతిభ కనబర్చి నిజామాబాద్‌లో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోర్తాడ్ విద్యార్థులు



మోర్తాడ్: మోర్తాడ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టు పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి పెద్దన్న తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బేగంపేట్ ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మోర్తాడ్ విద్యార్థులు పాల్గొని గల్ఫ్ వలసలు అంశంపై ప్రదర్శన ఇచ్చారు. గల్ఫ్ వలసలపై విద్యార్థులు మదన్, కార్తీక్, లహరి, సోనీ, మధులు సర్వే నిర్వహించి స్టడీ ప్రాజెక్టును సిద్ధం చేసి ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలను అందించారు. వైస్ ప్రిన్సిపాల్ ఖాజా అసిపుల్లా, జిజ్ఞాస కో– ఆర్డినేటర్ అశోక్, అధ్యాపకులు పూజ పాల్గొన్నారు.

పిల్లల బరువు, ఎత్తులను నమోదు చేయాలి


పరిశీలిస్తున్న బోధన్ సీడీపీవో జానకీబాయి

రెంజల్(బోధన్): అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరువు, ఎత్తు, జబ్బ చుట్టు కొలతలను యాప్‌లో నమోదు చేయాలని బోధన్ సీడీపీవో జానకీబాయి సూచించారు. బుధవారం వీరన్నగుట్ట హైస్కూల్‌లో మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ.. కేంద్రాలకు అందించిన నూతన బరువు, ఎత్తు మిషన్ కొలిచే మిషన్‌లతో పాటు జబ్బ చుట్టు కొలతలను తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో పిల్లల సర్వే రిపోర్టులు నమోదు చేయాలని వివరించారు. సమయపాలన పాటించాలని ఆదేశించారు. మండల సూపర్‌వైజర్ ప్రమీల రాణి ఉన్నారు.

బార్ అసోసియేషన్ ప్రతినిధుల నియామకం


మాట్లాడుతున్న పోశెట్టి, ప్రతినిధులు

బోధన్: బోధన్ బార్ అసోసియేషన్ క్రీడ, సాంస్కృతి కార్యదర్శిగా డాక్టర్ పల్నాటి సమ్మయ్య, మహిళా ప్రతినిధిగా మాధవీలత, కార్యవర్గ సభ్యులుగా ఎస్. గంగాధర్ గౌడ్, ఎస్.సాయిలు, వై.రాఘవేందర్‌లను నియమించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఈరడి పోశెట్టి తెలిపారు. బుధవారం పట్టణ కేంద్రంలోని కోర్టు భవనం అసోసియేషన్ గదిలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో పలువురు ప్రతినిధుల నియామకాన్ని ఏకగ్రీవంగా కార్యవర్గం ఆమోదించిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడు సయ్యద్ అఫ్సర్ పాషా, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ఆర్ కోటేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శి వాజిద్ హుస్సేన్, కోశాధికారి శ్రీధర్‌బాబు, గ్రంథాలయ కార్యదర్శి ఆరిఫొద్దీన్, కార్యవర్గ సభ్యులు అనిల్‌కుమార్, రాహుల్ పాల్గొన్నారని ఆయన వెల్లడించారు.

సజ్జ పంటలో వెంటనే సస్యరక్షణచర్యలు చేపట్టాలి



బాల్కొండ: సజ్జ పంటలో కత్తెర పురుగు నివారణ కోసం వెంటనే సస్య రక్షణ చర్యలు చేపట్టాలని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి సూచించారు. బుధవారం బోదేపల్లిలో ఆయన సజ్జ పంటను పరిశీలించారు. ఈసందర్భంగా సజ్జ పంటలో కత్తెర పురుగు నివారణ కోసం చేపట్టవలిసిన చర్యలు గురించి వివరించారు. ఏఈవో నిహారిక, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సజ్జ పంట పరిశీలన

వేల్పూర్: మండలంలో సాగుచేస్తున్న సజ్జ పంటకు కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి నర్సయ్య పేర్కొన్నారు. బుధవారం ఆయన పచ్చలనడ్కుడలో సజ్జ పంటను పరిశీలించారు. ఏఈవో వినయ్, రైతులు పాల్గొన్నారు.

ఈజీఎస్ కూలీలకు సౌకర్యాలు కల్పించాలి

కమ్మర్‌పల్లి: ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం నాగాపూర్‌లో ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండుటెండలో పని చేస్తున్న కూలీలకు టెంటు ఏర్పాటు చేయాలన్నారు. కొలతలతో పని లేకుండా రోజు కూలీ రూ.380 ఇవ్వాలన్నారు. సత్తెక్క, సాగర్, అనిల్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం మిర్దాపల్లి గ్రామానికి చెందిన పలువురు నాయకులు బుధవారం బీజేపీలో చేరారు. మామిడిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మిర్దాపల్లి మాజీ సర్పంచ్ గడ్డం గంగా రెడ్డి, నాయకులు నూత్‌పల్లి వెంకటేష్, పెద్ద గంగారం, సాయిరత్నంతో పాటు పలువురు జిల్లా ఎంపీ అర్వింద్ సమక్షంలో పార్టీలో చేరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ నర్సింహా రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ద్యాగ ఉదయ్, ఆర్మూర్, ఆలూర్ మండలాల అధ్యక్షులు రోహిత్ రెడ్డి, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

ఈ- పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలి



కమ్మర్‌పల్లి: రైతులకు ఈ–పాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని డీఏవో వాజిద్ హుస్సేన్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కమ్మర్‌పల్లితో పాటు, కోనాపూర్, కోనాసముందర్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ–పాస్ మిషన్‌లో నమోదైన ప్రకారం ఎరువుల నిల్వ ఉందో లేదో దుకాణాల్లో పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ–పాస్ మిషన్ ద్వారా కాకుండా రైతులకు నేరుగా ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్య, ఏవో లావణ్య, ఏఈవోలు ఉన్నారు.

హాసాకొత్తూర్‌లో పంట పరిశీలన

కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో సాగవుతున్న సజ్జ పంటను డీఏవో వాజిద్ హుస్సేన్, భీమ్‌గల్ ఏడీఏ మల్లయ్యతో కలిసి బుధవారం పరిశీలించారు. పంటలో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉండడం గమనించారు. ఈ పురుగు ఉధృతి వల్ల రైతులకు అధిక పంట నష్టం అయ్యే అవకాశం ఉన్నందున రైతులకు పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ చర్యలను సూచించారు.

పాల బకాయిలు వెంటనే చెల్లించండి


కోటగిరిలో రాస్తారోకో చేస్తున్న పాల ఉత్పత్తిదారులు

రుద్రూర్ : కోటగిరి మండల కేంద్రంలో విజయ డైరీ పాల కేంద్రం వద్ద బుధవారం పాడి రైతులు ఆందోళన చేశారు. విజయ డైరీలో పాలకు సంబంధించిన డబ్బులను 45 రోజులుగా చెల్లించడం లేదని ఆరోపించారు. గతంలో 15 రోజులకు ఒక సారి బిల్లులు ఇచ్చేవారని, ప్రస్తుతం మూడు బిల్లులు రావాల్సి ఉన్నాయని అన్నారు. కోటగిరి– పోతంగల్ ప్రధాన రహదారిపై పాల క్యాన్లను పెట్టి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. తమకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు.

ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ఫోన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడించడంతో రైతులు ఆందోళన విరమించారు.

'బీజేపీ దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించాలి'


మాట్లాడుతున్న సీపీఎం నేత పాలడుగు భాస్కర్

వర్ని: బీజేపీ నుంచి దేశాన్ని రక్షించుకొనే బాధ్యత ప్రతి భారతీయుడిపై ఉందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. బుధవారం వర్ని పార్టీ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెద్ది వెంకట్రాములు అధ్యక్షతన నిర్వహించారు. పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. బీజేపీ మతతత్వ, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను ధిక్కరించి, ప్రజాస్వామ్య ఇండియా కూటమి అభ్యర్థులను ఎన్నుకొనే సువర్ణ అవకాశం ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. బీజేపీ దాని మిత్రపక్షాలను చిత్తుగా ఓడించి, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర కమిటీ సభ్యులు రమ, నూర్జహాన్, నాయకులు శంకర్ గౌడ్, వెంకటేష్, జంగం గంగాధర్, నన్నేసాబ్, యేషాల గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రజాప్రతినిధులు, అధికారులు సూచించారు. జిల్లాలో పలు చోట్ల బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరి ఏ–గ్రేడ్ ధాన్యానికి రూ.2,203 ధర చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. ధాన్యాన్ని నిర్దేశించిన తేమ శాతం ఉండేంత వరకు ఆరబెట్టి, ఎటువంటి తాలు గింజలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

– సాక్షి నెట్‌వర్క్


ఉప్లూర్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డీఏవో వాజిద్ హుస్సేన్


తాళ్లరాంపూర్‌లో.. తహసీల్దార్ యూసుఫ్


ముల్లంగి (బి)లో.. చైర్మన్ బూరోళ్ల అశోక్


రెంజర్లలో.. అధికారి మహేందర్ రెడ్డి


పచ్చలనడ్కుడలో..

సైబర్ నేరాలపై అవగాహన

మోర్తాడ్: సైబర్ నేరాలపై అవగాహన ద్వారా నేరాలను అరికట్టవచ్చని మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డి అన్నారు. బుధవారం మోర్తాడ్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఫోన్లు చేతిలో పట్టుకున్నప్పుడు అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ నంబర్ లేదా మరే ఇతర సమాచారం అడిగినా చెప్పవద్దు అని సూచించారు. ఈ విషయాలపై విద్యార్థులు వారి తల్లితండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠాపన



మాక్లూర్: దుర్గానగర్ కిందితండాలో బుధవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో తండావాసులు ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ముందుగా ఆంజనేయ స్వామి విగ్రహానికి వేద బ్రాహ్మణులు ప్రత్యేక పూజలు, యజ్ఞాలు చేశారు. అనంతరం ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో సురేష్‌నాయక్, గంగా రెడ్డి, గంగోనే సంతోష్, వినోద్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నియామకం

ఖలీల్ వాడి: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అసెంబ్లీ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్లను నియమిస్తూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ అర్బన్‌కు ముప్ప గంగారెడ్డి, నిజామాబాద్ రూరల్‌కు సత్యనారాయణ, బాల్కొండకు బండి శ్రీనివాస్, ఆర్మూర్‌కు రామ్ భూపాల్, బోధన్ మహమ్మద్ ఇర్ఫాన్ ఆలీలను నియమించారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ–తెలుగు) – 11.40, 2.20, 5.00, 7.40, 10.20
స్క్రీన్-2 – టిల్లు స్క్వేర్ (తెలుగు) – 10.20, 1.20, 4.20, 7.20, 10.20
స్క్రీన్-3 – ది గోట్ లైఫ్ (తెలుగు) – 11.05, 6.00, 9.40 రజాకార్–2.45
స్క్రీన్-4 – క్రూ – 10.10, 4.10, 7.00, 10.10 ఓం భీమ్ బుష్ – 04.04

క్లుప్తంగా

ముథోల్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో–ఆర్డినేటర్‌గా వెంకట్రామ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని మాజీ ఎంపీటీసీ ముస్కు వెంకట్రామ్ రెడ్డి ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ముథోల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో–ఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. తనపై నమ్మకంతో ముథోల్ ఎన్నికల కో–ఆర్డినేటర్‌గా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, తదితరులకు వెంకట్రామ్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

బీజేవైఎం ఆలూర్ మండల ఉపాధ్యక్షుడిగా అరుణ్



పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల బీజేవైఎం ఉపాధ్యక్షుడిగా ఆలూర్ గ్రామానికి చెందిన గుండం అరుణ్ నియమితులయ్యారు. మామిడిపల్లిలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎంపీ ధర్మపురి అర్వింద్ ఈ మేరకు అరుణ్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అలాగే రాబోయే ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని ఎంపీ అర్వింద్ సూచించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగా రెడ్డి, ఆలూర్ మండల అధ్యక్షుడు కొత్తూరు గిరీష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రశయ్ తేజ, తదితరులు పాల్గొన్నారు.

'నష్ట పరిహారం చెల్లించాలి'



ఆర్మూర్‌టౌన్: నిజాంసాగర్ కెనాల్ కట్ట తెగిపోవడంతో నష్టపోయిన బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజా పంథా పార్టీ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకోవాలని, ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏవో ప్రశాంత్‌కు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం సీపీఐఎంఎల్ ప్రజా పంథా మాస్ లైన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. నేతలు బి.దేవారం, బి.కిషన్, అనిల్ కుమార్, నజీర్, బాధిత కాలనీవాసులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన డైరెక్టర్లు



భీమ్‌గల్: ముచ్కూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన తొమ్మిది మంది డైరెక్టర్లు బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి జనరంజక పాలనకు ఆకర్షితులై అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు బొదిరె స్వామి, పట్టణ అధ్యక్షుడు జేజే నర్సయ్య, తదితరులు ఉన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



వర్ని: సిద్దాపూర్‌లో అటవీ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విష జ్వరాలు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. 250 మందికి షుగర్, బీపీ సాధారణ చికిత్సలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. మోస్రా మెడికల్ ఆఫీసర్ విజయ కుమార్, పల్లె దవాఖాన వైద్యాధికారి ఆంద్రూస్, పబ్లిక్ హెల్త్ నర్స్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

కోతల సమయంలో చెరువు తూములు తెరవద్దు

రుద్రూర్: చిక్కడపల్లి శివారులో వరి కోతలు సాగుతున్న తరుణంలో చెరువు తూము ద్వారా కొందరు ఆకతాయిలు నీటిని విడుదల చేస్తున్నారని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నీటి ద్వారా కోత పనులకు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ట్రాక్టర్, కోత మిషన్ తీసుకురావడానికి అవస్థలతో పాటు అదనపు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇఫ్తార్ విందులో వినయ్ రెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్‌లో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ ఇందులో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్ రెడ్డి పాల్గొన్నారు. ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు అయ్యప్ప శ్రీనివాస్, సాయి బాబా గౌడ్, అథిక్, రహమాన్ తదితరులున్నారు.